క్లుప్తంగా

విద్యార్థిని చదువుకు ప్రోత్సాహం



విద్యార్థిని తల్లిదండ్రులకు చెక్కు అందిస్తున్న దాతలు

చీరాల టౌన్: ఈఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభచూపిన నిరుపేద విద్యార్థినికి నగదు బహుమతిని అందించి తమ ఉదారతను చాటుకున్నారు. మండలంలోని తోటవారిపాలెం శ్రీసాయి హైస్కూల్లో పదో తరగతిలో స్కూల్ ఫస్ట్ సాధించిన వీవర్స్ కాలనీకి చెందిన బిట్రా తేజస్వినీకి గ్రామానికి చెందిన మల్లెల ఉపేంద్ర, నిహాల్ ఉపేంద్రలు తమ పూర్వీకుల జ్ఞాపకార్థం విద్యార్థిని తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, శారదకు రూ.5 వేలు ప్రోత్సాహక నగదును అందించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

200 శానిటేషన్ బాటిళ్లు పంపిణీ

పర్చూరు (చినగంజాం): కరోనా తిరిగి విజృంభిస్తున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పర్చూరు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ డైరక్టర్ మామిడిపాక హరిప్రసాదరావు అన్నారు. ప్రజలు మాస్కులు ధరించి సామాజిక దూరం పాటించాలని ఆయన కోరారు. ఆసుపత్రికి 200 శానిటేషన్ బాటిళ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తవ్వా నారాయణ, తమ్మన శివశంకరరావు, మాధవి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, టైలరింగ్, హెల్పర్ ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో పదోతరగతి, ఆపైన చదివిన నిరుద్యోగ యువతీ యువకులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి ఈ తమ్మాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

నేడు అద్దంకిలో 3-కే రన్

అద్దంకి రూరల్: 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా శనివారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం 3-కే రన్ నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఉదయం 8 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్, భవానిసెంటర్, గవర్నమెంట్ హాస్పిటల్ మీదుగా పురపాలక సంఘం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీలకు విద్యార్థినులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

అద్దంకి: రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీలకు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈనెల 20న బాపట్లలో జిల్లా స్థాయిలో కౌశల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈపోటీలకు అద్దంకి పట్టణంలోని ప్రకాశం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. వీరిలో సుంకర సాయి చరిష్మా, శ్రీహర్షిణీ, ప్రత్యూష ఉన్నారు. వీరిని పీడీ కృష్ణారావు, హెచ్‌ఎం కే శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అభినందించారు.

28 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

జే.పంగులూరు: క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జ్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆశీస్సులతో, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి సహకారంతో కొండమంజులూరు కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి. పోటీలు ఈనెల 28, 29, 30వ తేదీల్లో జగరనున్నట్లు నిర్వాహకుడు పురుషోతం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు మొదటి బహుమతి ఇన్‌చార్జి హనిమిరెడ్డి రూ. 50,011, షీల్డ్ అందిస్తున్నట్లు తెలిపారు. రెండో బహుమతి వైఎస్సార్ సీపీ మండల నాయకుడు స్వయంపు హనుమంతురావు రూ.40116, షీల్డ్, మూడో బహుమతి మాజీ ఏఎంసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు జంపాని రవిబాబు రూ. 30116, షీల్డ్, నాలుగో బహుమతి మండల వైఎస్సార్ సీపీ నాయకుడు భీమనాథం అంజిరెడ్డి రూ. 20116, షీల్డ్, ఐదో బహుమతి రేణింగవరం సర్పంచ్ భూమ హరిప్రసాద్‌రెడ్డి రూ. 10116, షీల్డ్ అందించన్నుట్లు తెలిపారు. పోటీలకు స్టేజ్, లైటింగ్ శ్రీ మౌర్య మెడికల్స్ అద్దంకి అందిస్తున్నట్లు తెలిపారు.

రామానుజన్ చిరస్మరణీయుడు



అద్దంకిలో సీనియర్ గణితశాస్త్ర అధ్యాపకుడిని సన్మానిస్తున్న సహచరులు



మైలవరంలో రామానుజన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

- ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

జే.పంగులూరు/బల్లికురవ/అద్దంకి రూరల్/అద్దంకి: గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాసరామానుజన్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. అసామాన్యమైన, క్లిష్టమైన గణిత సమస్యలను పరిష్కరించి యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరచిన గొప్ప శాస్త్రవేత్త అన్నారు. ఈసందర్భంగా శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. పంగులూరు మండల పరిధిలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బంగారుకొండ ఆధ్వర్యంలో రామానుజం చిత్రపటానికి పూలమాలలు వేసి గణిత ఉపాధ్యాయులు బి విఠలేశ్వరరావు, లీలావతి, సురేష్, సోమశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. గణిత శాస్త్రానికి సంబంధించి 100 ప్రాజెక్టులు ప్రదర్శనకు ఉంచారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గాదే బ్రహ్మారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సుబ్బారెడ్డి, బలరామిరెడ్డి, ఓబులరెడ్డి, అజిత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి పట్టణంలోని శింగరకొండ సమీపంలోని కట్టా రామకోటేశ్వరరావు డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి వేడులను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను గణిశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ మోహన్‌రావు, రిటైర్డ్ గణిత అధ్యాపకుడు సుబ్బయ్య, సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

అద్దంకి మండలంలోని మైలవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం శ్రీనివాస రామానుజన్ జయంతి జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీనివాసరాజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు. రమేష్, ఎస్. శ్రీనివాసులు, శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, లక్ష్మీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు గణితంలో పట్టు సాధిస్తే ఏ రంగంలోనైనా రాణించగలరని బల్లికురవ మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం శ్రీనివాసరామానుజం జయంతి సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో ముగ్గులో గణితం కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో2 కె. రమేష్‌బాబు, హెచ్‌యం కె. హనుమంతరావు ఉపాధ్యాయులు విజేతలను అభినందించారు.



బల్లికురవలో ముగ్గులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

రామానుజన్ బాటలో నడవాలి..

మార్టూరు: గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవం మార్టూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. బొబ్బేపల్లి, కోనంకి, మార్టూరు, వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, స్థానిక హర్షిణి విద్యాసంస్థలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్స్ పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్న నూతలపాడుకు చెందిన రైతు చిమటా వెంకటేశ్వర్లును బొబ్బేపల్లి పాఠశాల హెచ్‌ఎం బాచర్ల చలపతి, గణిత ఉపాధ్యాయులు జి. గంగాధర్, సిహెచ్ మంజూష, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి సన్మానించారు.



బొబ్బేపల్లిలో రైతు వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

యద్దనపూడి: మండలంలోని యనమదల యూపీ పాఠశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజం జయంతి సందర్భంగా ఎంఈవో గోపి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

చీరాల అర్బన్: గణిత శాస్త్రం నేర్చుకోవడం ద్వారా తార్కిక ఆలోచనలు పెరిగి మిగిలిన విషయాలు కూడా సులభంగా అర్థం చేసుకోవచ్చని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం బి.సాల్మన్ అన్నారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ 136వ జయంతిని పురస్కరించుకుని పేరాల హైస్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో గణిత దినోత్సవం నిర్వహించారు.



జే.పంగులూరులో గణిత ప్రాజెక్టను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



సబ్సిడీపై మినుము విత్తనాలు అందిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

అన్నదాతలకు అండగా నిలిచిన సీఎం జగన్

- సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కరణం

చీరాల టౌన్: వరదలు, తుఫాన్ల సమయంలో ఆర్థికంగా నష్టపోయిన అన్నదాతలకు అండగా నిలిచి తక్షణమే పంటల సాగుకు విత్తనాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం చీరాల వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయంలో వద్ద ఇటీవల వచ్చిన తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో అందించిన మినుము విత్తనాలు అన్నదాతలకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కరణం మండలంలో మినుగు సాగు చేసి నష్టపోయిన రైతులకు 61 క్వింటాళ్ల మినుము విత్తనాలను రైతులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా చేసి అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకోవడంలో సీఎం వైఎస్ జగన్‌కు మరొకరు సాటిరారన్నారు. రైతులకు పంటల సాగులో మెళుకువలు, యంత్ర పరికరాలు, సాగునీరు, యూరియాలు అందించేందుకు గ్రామస్థాయిలోనే దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రకృతి విపత్తులు, తుఫాన్లు సమయంలో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అలానే వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సత్తార్ ఏడీఏ ఎప్రాయం, ఏవోలు సుమతీ, కాశీవిశ్వనాథ్, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, రూరల్ అధ్యక్షుడు అంకాళరెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ కేశవులు, జేసీఎస్ కన్వీనర్ సాంబశివరావు, పార్టీ నాయకులు నారాయణ, శ్రీనివాసరావు, శివనాగులురెడ్డి, వాసు, మార్క్, జ్వాలా తదితరులు ఉన్నారు.

సాహిత్యానికి పెట్టనికోట చిన్నయసూరి

అద్దంకి: తెలుగు సాహిత్యానికి చిన్నయసూరి పెట్టనికోట వంటి వాడని అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గా గాయత్రి అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో ఘనంగా చిన్నయసూరి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చిన్నయసూరి బాల వ్యాకరణం రచించి వారికి అందించారని గుర్తు చేశారు. సరళ తెలుగులో నీతి చంద్రిక రాశారన్నారు. తరువాత చిన్నయసూరి చరిత్రను బాలికలకు అర్థమయ్యే విధంగా సాహితీవేత్త అనీలకుమార సూరి వివరించారు. మరో సాహితీవేత్త గాడేపల్లి దివాకరదత్తు చిన్నయసూరి గురించి మాట్లాడారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లెవీ ప్రసాద్, దేవపాలన, పాలపర్తి జ్యోతిష్మతి, షేక మహ్మద్ రఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దివాకరదత్తు

ఆర్బీకేల్లో పంటనష్ట జాబితాల ప్రచురణ



కొల్లావారిపాలెంలో జాబితా ప్రదర్శిస్తున్న వ్యవసాయాధికారి



తిమ్మాయపాలెంలో పంటనష్ట పరిహారం జాబితాను ప్రదర్శిస్తున్న ఏవో

పర్చూరు (చినగంజాం): తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతుల వివరాలతో కూడిన జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించామని రైతులు సరిచూసుకోవాలని పర్చూరు వ్యవసాయశాఖ ఏడీఏ మోహనరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నూతలపాడు, చింతగుంటపాలెం, కొల్లావారిపాలెం గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల్లో పంటనష్ట రైతుల వివరాలను రైతుభరోసా కేంద్రాలలో ప్రదర్శించారు. జాబితాలో ఫిర్యాదులను వెంటనే రైతులు తెలియజేయాలని, జాబితాలోని సవరణలు పూర్తి చేసి తుది జాబితాను ఉన్నతాధికారులకు పంపుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి: అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పంట నష్టపోయిన రైతుల జాబితాను ఉంచామని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ చెప్పారు. ఆయన శుక్రవారం మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలో 118 మంది రైతులకు సంబంధించి 97.73 హెక్టార్లలో మొక్కజొన్న, 643 మంది రైతులకు సంబంధించి 438.40 హెక్టార్లలో వరి పంట, 398 మంది రైతులకు సంబంధించి 250.77 హెక్టార్లలో పొగాకు పంట దెబ్బ తిందని చెప్పారు. అదే విధంగా 54 మంది రైతులకు సంబంధించి 30.83 హెక్టార్లలో కంది పంటను నష్టపోయినట్లు చెప్పారు. మొత్తం 1272 మంది రైతులకు 865.08 హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు చెప్పారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

- ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు
- పాల్గొన్న ఎమ్మెల్యే కరణం



సెమీ క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కరణం

చీరాల/వేటపాలెం/చీరాల టౌన్: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బుర్లవారిపాలెంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కరణం హాజరయ్యారు. ఆటపాటలు, దేవుని గీతాలకు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు కేరింతలతో సెమీ క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి అందరికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసుక్రీస్తు లోక రక్షకుడని క్రీస్తు పుట్టుక లోకానికే వెలుగుగా నిలిచిందన్నారు. విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న అత్యధిక ప్రాధాన్యత, పథకాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానవంతులుగా, భావిభారత ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కౌశల్ సైన్స్, క్విజ్ పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, బహుమతులను ఎమ్మెల్యే అందించారు. పట్టణంలోని ఎల్బీఎస్ నగర్‌లో ఉన్న ముస్లిం షాదీఖానాలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సుబ్రమణ్యం, సుదారాణి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరళ, వైస్ ప్రిన్సిపాల్ శామ్యూల్‌జాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో..



దేవుడి గీతాలకు నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

చీరాల తహశీల్దార్ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు చీరాల ఆర్డీవో పి.సరోజిని ముఖ్య అతిథిగా, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఎంపీడీవో నేతాజీ, వేటపాలెం తహశీల్దార్ అశోక్‌వర్ధన్‌లు హాజరయ్యారు. రెవెన్యూ ఉద్యోగుల సమక్షంలో ఆర్డీవో సరోజిని, ఇతర అధికారులు క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. బుజ్జి పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలతో పాటు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సురేష్‌బాబు, సర్వే ఇన్‌స్పెక్టర్ జి.వి.ముసలయ్య, ఈడీటీ ఆదినారాయణ, ఆర్‌ఐలు అర్జున్, శేఖర్, వీఆర్వోలు, కార్యాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ, శాంతిలకు ప్రతిరూపమైన జీసస్‌ను అందరూ అనుసరించాలని వేటపాలెం తహశీల్దార్ అశోక్‌వర్ధన్ సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

చినగంజాం: బాలలను బాల్యం నుంచే దేవుని యెడల భయభక్తులతో పెంచి సమాజానికి ఆమోద యోగ్యంగా సన్మార్గంలో నడిపించాలని దైవ సేవకులు జీ శాంసన్ అన్నారు. క్రిస్మస్ క్యారల్స్‌లో భాగంగా శుక్రవారం చినగంజాం అంబేడ్కర్ నగర్‌లో క్యారల్స్‌లో పాల్గొన్న చిన్నారులకు ఆయన క్రిస్మస్ కానుకలు అందజేశారు. కార్యక్రమంలో క్రిస్మస్ క్యారల్స్ నిర్వాహకుడు మేకల మేషక్ బాబు, మేడికొండ కళాసాగర్, అల్లడి నవీన్, మార్పు సన్నీ తదితరులు పాల్గొన్నారు.



చినగంజాంలో చిన్నారులకు క్రిస్మస్ కానుకలు అందజేస్తున్న పాస్టర్ శ్యాంసన్



చీరాలలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న తహశీల్దార్ అశోక్‌వర్ధన్



సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రభాకరరావు

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

బల్లికురవ: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం ఉత్తరద్వారం గుండా విష్ణుమూర్తిని దర్శించుకుంటే ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని కొమ్మినేనివారిపాలెం, కొత్తపాలెం, కొత్తమల్లాయపాలెం, ఆలయాల అర్చకుడు ఎం. శ్రీనివాస్, అనిల్ కుమార్, ఐవీ సుబ్బాచార్యులు, డీ.గోవర్ధనాచార్యులు అన్నారు. శనివారం వైకుంఠ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి, సందర్భంగా ఆయా ఆలయాల్లో ఉత్తరద్వారం గుండా విష్ణుమూర్తి దర్శనానికి ఏర్పాట్లు చేపట్టారు. వేకువజామున 4 గంటల నుంచే ఉత్తరద్వారం గుండా దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తారని అర్చకులు తెలిపారు.

నేడు ముక్కోటి ఏకాదశి..

చీరాల అర్బన్: ముక్కోటి ఏకాదశి వేడుకలకు దేవాలయాలు ముస్తాబయ్యాయి, ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం తెల్లవారుజాము నుంచే చీరాల పట్టణం, గ్రామాల్లోని ప్రాధాన్యాత కలిగిన దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ఉత్తర ద్వార దర్శనాలు ఏర్పాటు చేస్తున్నారు. దేవాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి విశేష పూజలు చేయనున్నారు. పేరాలలోని మదనగోపాల స్వామి దేవాలయం, వైకుంఠపురం, బోస్‌నగర్ పలు దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వార దర్శనాలు ఏర్పాటు చేయనున్నారు.

నేడు నియోజకవర్గంలో హనిమిరెడ్డి పర్యటన

అద్దంకి: వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి శనివారం నియోజకవర్గంలో పర్యటించనున్నారని ఆపార్టీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 7 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా'లో భాగంగా 3-కే రన్ కార్యక్రమంలో పాల్గొంటారు. 9 గంటలకు కాకానిపాలెంలోని రంగనాయకుల స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, సాయంత్రం 7 గంటలకు సంతమాగులూరు మండలంలోని గురిజేపల్లి ఎస్సీ కాలనీలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారని వైఎస్సార్ సీపీ వర్గాలు తెలిపాయి.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



అక్కాయిపాలెంలో ట్యాబ్‌లతో విద్యార్థులు ఉపాధ్యాయులు

వేటపాలెం: ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను విద్యార్థులకు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం భవనం భద్రిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అక్కాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 22 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలో భాగంగా ప్రభుత్వం ట్యాబ్‌లను హెచ్‌ఎం శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసరెడ్డి, అనూరాధ, అంజమ్మ, బాల సుబ్రహ్మణ్యం, కమూరున్నీసా బేగం పాల్గొన్నారు.



జాగర్లమూడిలో ట్యాబ్‌లు అందజేస్తున్న అమ్మిరెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాసరావు

జాగర్లమూడిలో..

యద్దనపూడి: మండలంలోని జాగర్ల మూడి పాఠశాలలో 21 మంది విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. బాపట్ల పార్లమెంట్ జిల్లా కార్యదర్శి తమ్మా అమ్మిరెడ్డి చేతులమీదుగా వాటిని విద్యార్థులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాని, వాటిని జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలోహెచ్‌ఎం బెల్లం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి అఖండ నామ సంకీర్తన



అఖండ నామ సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

చినగంజాం: ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని రాజుబంగారుపాలెం పంచాయతీ కుక్కలవారిపాలెం గ్రామంలో వేంచేసియున్న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం అఖండ నామ సంకీర్తన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయం నిర్వాహకులు కొణసం సుబ్బారెడ్డిస్వామి ఆధ్వర్యంలో జై వీరబ్రహ్మ జై, గోవిందమాంబ జై అనే నామాన్ని శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్విరామంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని అమీన్‌నగర్, రాజుబంగారుపాలెం, కుక్కలవారిపాలెం, శాంతినగర్ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని నిర్విఘ్నంగా కొనసాగించారు. భక్తులు విశేషంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

అద్దంకిలో వాలీబాల్ పోటీలు

అద్దంకి రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు జవ్విరాము ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలకు 6 జట్లు పాల్గొనగా 2 జట్లు ఫైనల్‌కు చేరాయి. శుక్రవారం ఫైనల్‌లో గెలుపొందిన విజేతలకు శనివారం అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి బహుమతులు అందజేస్తారని రాము తెలిపారు.